

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM


# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777

విజయవాడ బుధవారం 19-08-2026 సంపుటి: 02 సంచిక : 47 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Wednesday 19-08-2026 Volume :02 Issue: 47 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani

## ఉరిశిక్షకు బదులు విషపు ఇంజెక్షన్!



02

- ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ డిమాండ్
- మరణశిక్ష అమలు పద్ధతి మార్చాలన్న పిటిషన్ కొట్టివేత
- ప్రత్యామ్నాయ పద్ధతులపై సమగ్ర సమీక్షకు అవకాశం
- ఖైదీ గౌరవం, అనవసర బాధ తగ్గింపే రాజ్యాంగ లక్ష్యం
- 2017 నాటి పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు

## మెటాకు కేంద్రం వార్నింగ్




02

- పిల్లలపై లైంగిక కంటెంట్ విషయంలో మెటాకు కేంద్రం హెచ్చరిక
- చట్టాలను ఉల్లంఘిస్తే సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండదు..
- సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలన్నింటికీ ఒకే నిబంధనలు వర్తింపు
- భారత భాషలు, సంస్కృతికి అనుగుణంగా కంటెంట్ మోడరేషన్‌కు సూచన
- ఏఐ కంటెంట్‌కు లేబులింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రం ఆదేశం



## సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన

- 20 నుంచి 30 వరకు ఖరారైన షెడ్యూల్
- 10 రోజుల పాటు యూకే, అమెరికాలో సీఎం పర్యటన
- మొదట లండన్ సందర్శన అనంతరం అమెరికాకు ప్రయాణం
- ఆయా దేశాల్లోని వర్సిటీల సందర్శన

హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా, బ్రిటన్ పర్యటన షెడ్యూల్ ఖరారయ్యింది. ఈనెల 20 నుంచి 30 వరకు యూకే, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఇవాళ రాత్రికి దిల్లీకి వెళ్లనున్నారు. అక్కడ జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం పాల్గొంటారు. రేపు రాత్రి దిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరనున్నారు. ఎల్లుండి రాత్రి 12.30 గంటలకు విమానం ఎక్కుతారు. ఈ నేపథ్యంలో సీఎం రెండు దేశాల్లో ఉన్న పలు వర్సిటీలను సందర్శించనున్నారు. అలాగే అక్కడి వర్సిటీ బృందాలతో సమావేశం కానున్నారు. లండన్‌లో పర్యటన అనంతరం రేవంత్‌రెడ్డి అమెరికాకు వెళ్తారు.

సీఎం లండన్ షెడ్యూల్ ఇదే :

ఆగస్టు 21న లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అక్కడి ఎమిరేట్స్

-మిగతా 2 లో

## స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం

# రిజర్వేషన్లు

**బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం**

- అక్టోబర్ లోగా - పట్టణ స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలపై చర్చ
- డెడికేటెడ్ కమిషన్ నివేదికపై లోతుగా చర్చించి నిర్ణయం
- సుమారు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్లో సమీక్ష

అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సుదీర్ఘ భేటీలో పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రధానంగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనకు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలన్న నిర్ణయానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల్లో 34.50 శాతం, ఇతర స్థానిక సంస్థల్లో 33.50 శాతం రిజర్వేషన్లు బీసీలకు వర్తింపజేయాలని కేబినెట్ తీర్మానించింది. అయితే, బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం

-మిగతా 2లో






## ఇమ్రాన్ ఖాన్‌ను ఆస్పత్రిలో చేర్చండి

- ప్రత్యేక వైద్య బోర్డుతో వైద్య పరీక్షలు జరిపించండి
- వారానికోసారి కుటుంబీకులు కలిసేందుకు అనుమతించండి
- పాకిస్తాన్ ప్రభుత్వానికి అక్కడి సుప్రీంకోర్టు ఆదేశం

02



02

## భారత ఎన్నికల వ్యవస్థను ఆదర్శంగా తీసుకోండి..

- అమెరికాలో ఓటర్ ఫొటో ఐడీ తప్పనిసరి చేయాలని సూచన
- 'సేవ్ అమెరికా యాక్ట్'ను ఆమోదించాలని పిలుపు
- భారత ఎన్నికల ప్రక్రియపై ట్రంప్ ప్రశంసలు
- అమెరికా ఎన్నికల్లో పౌరులకే ఓటు హక్కు
- మెయిల్ ఓటింగ్‌పై ఆంక్షలు విధించే ప్రతిపాదన
- జనవరి 29న చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

## ఈవీల వాహన కాలం ఐదేండ్లు పొడిగింపు!



02



## మండలిలో మాటకు.. మాట

- డీఎస్సీపై చర్చకు పట్టుబట్టిన వైసీపీ
- వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన ఛైర్మన్
- పోడియం వద్ద వైసీపీ సభ్యుల ఆందోళన
- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. వర్సెస్ ప్రతిపక్ష నేత బొత్స

అమరావతి :

శాసన మండలి సమావేశాలు వరుసగా రెండో రోజు కూడా డీఎస్సీ వివాదంతో వేడివేడిగా సాగాయి. పాలక, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఛైర్మన్ మోషేన్ రాజు అధ్యక్షతన మండలి సమావేశం మంగళవారం ఉదయం 10.05 గంటలకు ప్రారంభమైంది. డీఎస్సీ, స్పోర్ట్స్ కోటాలో అవకతవకలపై చర్చించాలంటూ వైసీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ తిరస్కరించారు. దీంతో వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియం వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు.

-మిగతా 2 లో

## ఏపీని చూసి ఢిల్లీ

# నేర్చుకోవాలి

**అమరావతి నిర్మాణం అద్భుతం.**




- ప్రపంచంలోనే గొప్ప నగరంగా మారుతుంది
- చంద్రబాబు ఓ విశ్వవిద్యాలయం.. లోకేష్ ఆయన పుత్రుడు
- పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్‌లో ఏపీ అనుభవం మాకు కావా
- పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏపీ దేశానికే మార్గదర్శి
- ఏపీ నుంచి ఎంతో నేర్చుకోవాలి.. ఢిల్లీకి సహకరించండి
- ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ సిర్సా

అమరావతి :

అమరావతి రాజధాని నిర్మాణం తీరును చూశాం. నిజంగా ఇదొక అద్భుతం. ప్రపంచంలోనే ఇదొక గొప్ప నగరంగా మారుతుంది. నారా చంద్రబాబు నాయుడు విజనరీ ముఖ్యమంత్రి. అభివృద్ధికి, దార్శనికతకు ఆయనొక విశ్వవిద్యాలయం. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఏపీ ప్రభుత్వం మార్గదర్శి. ఏపీని చూసి ఢిల్లీ ప్రభుత్వం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అనేక రంగాల్లో మాకు మీ సహకారం కావాలి అని మంత్రులు లోకేష్, టీజీ భరత్‌లతో ఢిల్లీ పరిశ్రమలు, ఆహారం, అటవీ పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ సిర్సా కోరారు. ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమలు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మంజిందర్

-మిగతా 2 లో




## దేశంలో 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు..

- 89 కేసులతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో
- సువేందు అధికారి రెండో స్థానం.. డీకే, చంద్రబాబుకు చెరో 19 కేసులు
- ప్రస్తుత, మాజీ ఎంపీలు-ఎమ్మెల్యేలపై 4,192 కేసులు పెండింగ్
- యూపీలోనే అత్యధికంగా 1,171 క్రిమినల్ కేసులు నమోదు
- తెలంగాణకు చెందిన 17 మంది ఎంపీల్లో 11 మందిపై కేసులు
- రాజ్యసభ సభ్యుల్లో 75 ని మందిపై క్రిమినల్ కేసులు
- ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, హైకోర్టుల పర్యవేక్షణ కోరిన హన్సారియా

న్యూఢిల్లీ,

దేశంలోని 28 రాష్ట్రాల్లో 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులున్నాయి. అత్యధిక కేసులున్నది మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపైనే. దేశంలోని సీఎంలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా ప్రజా ప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసులు, వారిపై తీసుకునే చర్యలపై అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారీ రూపొందించిన 96 పేజీల నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వారిపై చర్యలు తీసుకునే

-మిగతా 2లో



## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

- నిషేధిత జాబితా భూములకు నైతిక బాధ్యత వహించాలి
- సారీలు చెప్పి సరిపుచ్చుకోవడం కుదరదు
- బాధితుల కోసం జనతా గ్యారేజ్ తెరిచే ఉంటుంది
- బిఆర్ఎస్ నేత హరీస్ రావు డిమాండ్

హైదరాబాద్,

మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్

-మిగతా 2 లో

# ఉరిశిక్షకు బదులు విషపు ఇంజెక్షన్!


- ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ డిమాండ్
- మరణశిక్ష అమలు పద్ధతి మార్చాలన్న పిటిషన్ కొట్టివేత
- ప్రత్యామ్నాయ పద్ధతులపై సమగ్ర సమీక్షకు అవకాశం
- ఖైదీ గౌరవం, అనవసర బాధ తగ్గింపే రాజ్యాంగ లక్ష్యం
- 2017 నాటి పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు



న్యూఢిల్లీ,
మరణశిక్షను ఎదుర్కొంటున్న ఖైదీలను ఉరి తీసే ప్రస్తుత పద్ధతిని రద్దు చేసి, దాని స్థానంలో ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం వంటి తక్కువ బాధాకరమైన పద్ధతులను ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. అయితే ఒక నిపుణుల కమిటీ ద్వారా ప్రస్తుతం ఉన్న మరణశిక్ష అమలు పద్ధతిపై సమగ్ర సమీక్ష చేపట్టకుండా తమ తీర్పు కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకోలేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొందిమరణశిక్షను ఎదుర్కొంటున్న ఖైదీ గౌరవాన్ని కాపాడుతూనే అనవసరమైన బాధను తగ్గించడమనే రాజ్యాంగ లక్ష్యాన్ని ఏదైనా ప్రత్యామ్నాయ పద్ధతి మెరుగ్గా నెరవేరుస్తుందేమో అటువంటి సమీక్ష ద్వారా పరిశీలించవచ్చని కోర్టు తెలిపింది. ఉరి తీసే పద్ధతిని చట్టం నుంచి తొలగించాలని కోరుతూ సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం తన తీర్పును వెలువరించింది

# మెటాకు కేంద్రం వార్నింగ్

- పిల్లలపై లైంగిక కంటెంట్ విషయంలో మెటాకు కేంద్రం హెచ్చరిక
- చట్టాలను ఉల్లంఘిస్తే సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండదు..
- సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలన్నింటికీ ఒకే నిబంధనలు వర్తింపు
- భారత భాషలు, సంస్కృతికి అనుగుణంగా కంటెంట్ మోడరేషన్‌కు సూచన
- ఏఐ కంటెంట్‌కు లేబులింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రం ఆదేశం




న్యూఢిల్లీ:
పిల్లలపై అభ్యంతరకర, లైంగిక వీడియోలు (సీఎస్ఏఎం) విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే మెటాకు సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండదని కేంద్రం హెచ్చరించింది. ఈ విషయంలో ఎవరికైనా ఇదే రూల్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. సీఎస్ఏంఎ అంశాన్ని మెటా తీవ్రంగా పరిగణిస్తుందని, తన ప్లాట్‌ఫాంలపై అక్రమ, చట్టవ్యతిరేక కంటెంట్‌ను నియంత్రించడానికి కృషి చేస్తుందని ప్రభుత్వం తెలిపింది. అలాగే, ఇండియాలోని భిన్న భాషలు, సంస్కృతికి అనుగుణంగా కంటెంట్ మోడరేషన్ చేయాలని మెటాకు సూచించింది.మెటా ప్లాట్‌ఫాంలపై కంటెంట్‌ను అభివృద్ధి చేయడం, పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను నియంత్రించడంపై కేంద్రానికి, మెటాకు మధ్య చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున మెటాకు పలు సూచనలు అందాయి. సీఎస్ఏఎం కంటెంట్‌ను అరికట్టే విషయంలో మెటా బాధ్యతగా వ్యవహరిస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. చట్ట వ్యతిరేక, అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించడానికి మెటా మరిన్ని జాగ్రత్తలు తీసుకోనుంది. ఒకవేళ సీఎస్ఏఎం విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే వారికి అరెస్టు నుంచి రక్షణ కల్పించే సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ కోల్పోతారు. దేశంలోని చట్టాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుంది కేంద్రం. అంతర్జాతీయ ప్రమాణాల్ని ఇండియాలో తగ్గించాల్సిన అవసరం లేదు. అలాగే, భాష, సాంస్కృతికపరమైన సున్నితమైన అంశాలకు అనుగుణంగా సోషల్ మీడియా సంస్థలు తమ వ్యవస్థల్ని మార్చుకోవాలి. కేంద్రం ఈ అంశాల్ని మెటా, వాట్సాప్ వంటి వాటికి పరిమితం చేయడం లేదు. అన్ని సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్‌లకు వర్తించేలా చూస్తుంది. ఇటీవల వాట్సాప్ తీసుకురావాలని భావించిన యూజర్ నేమ్ విషయంలో కూడా కేంద్రం కఠినంగానే వ్యవహరించింది. వాట్సాప్ చేపట్టనున్న ఇతర అప్‌డేట్లపై కూడా కేంద్రం దృష్టి సారించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో వస్తున్న ఏఐ కంటెంట్‌పై కూడా కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ కంటెంట్ ఏఐతో రూపొందించిందా లేదా తెలుసుకునేందుకు వీలుగా ఆ ఫొటోలు, వీడియోలపై లేబుల్ ఉండేలా చూడాలని ఆదేశించింది.

# సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన

మొదటి తరువాయి

స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో సీఎం పాల్గొననున్నారు. ఆగస్టు 22న లండన్‌లో కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం సమావేశం కానున్నారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనెట్ హౌస్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్కు వెళ్తారు. ఆగస్టు 23న లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరతారు.
అమెరికా సీఎం సందర్శించే ప్రదేశాలు :
ఆగస్టు 24న బోస్టన్లో ఉదయం 10.30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐటీ క్యాంపస్‌కు వెళ్తారు. ఆగస్టు 25న ఉదయం 10.30 గంటలకు బోస్టన్లో నార్త్ ఈస్టర్న్ క్యాంపస్‌ను సందర్శిస్తారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ బృందంతో సమావేశం అవుతారు. అలా రాత్రి 7 గంటలకు బోస్టన్ నుంచి న్యూయార్క్ సిటీకి సీఎం పయనమవుతారు. ఆగస్టు 26న న్యూయార్క్‌లో రాత్రి 7 గంటలకు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఆగస్టు 29న

# ఈవీల వాహన కాలం ఐదేండ్లు పొడిగింపు!

-ముసాయిదా జారీ చేసిన కేంద్రం



న్యూఢిల్లీ:
బ్యాటరీ, హైడ్రోజన్ ఇంధన, సహజ వాయువుతో నడిచే వాహనాల జీవిత కాలాన్ని ఐదేండ్ల పాటు పొడిగించాలని కేంద్రం ప్రతిపాదించింది. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ 1989, సవరణల ముసాయిదాను రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంగళవారం జారీ చేసింది. ఈ నెల 10న ప్రచురించిన ప్రతిపాదిత నిబంధనల్లో మార్పుల్లో భాగంగా వీటిపై సలహాలు, సూచనలను 30 రోజుల్లో తెలియజేయాలంటూ కోరింది. అయితే అధికారికంగా తుది గెజిట్ ప్రచురితమైన తర్వాతే ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని ప్రకటించింది.గరిష్ట జీవిత కాలపరిమితి ఎంతో పేర్కొనపోయినప్పటికీ పైన పేర్కొన్న వాహనాల జీవిత కాలాన్ని ఇప్పుడున్న దానికి ఐదేండ్ల పాటు పొడిగిస్తారు. మల్టీ యాక్సిల్ సరకు రవాణా వాహనం 15 ఏండ్లు, ఇతర వాహనాలు 12 ఏండ్లు పూర్తిచేస్తే వాటిని మార్చకుండా వాటి జీవిత కాలాన్ని మరో ఐదేండ్లు పొడిగించుకోవచ్చు. అయితే దీని నిమిత్తం వాహన యజమాని నేషనల్ పర్మిట్ ఖాతాకు ప్రతి ఏటా రూ.16,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జాతీయ పర్మిట్‌ల ప్రక్రియను మరింత డిజిటలీకరించాలని కేంద్రం భావిస్తున్నది.

# పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

మొదటి తరువాయి

అంటే తెలంగాణ భవన్ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. మూసిపరివాహక ప్రాంతంలోని ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జనతా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30 శాతం గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30శాతం కమీషన్ అడుగుతున్నారని అంటూ విరుచుకుపడ్డారు.

# ఇమ్రాన్ ఖాన్‌ను ఆస్పత్రిలో చేర్చండి

-ప్రత్యేక వైద్య బోర్డుతో వైద్య పరీక్షలు జరిపించండి
-వారానికోసారి కుటుంబీకులు కలిసేందుకు అనుమతించండి
-పాకిస్తాన్ ప్రభుత్వానికి అక్కడి సుప్రీంకోర్టు ఆదేశం



ఇస్లామాబాద్:
జైల్లో ఉన్న పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయనను ఆస్పత్రికి తరలించాలని ఆ దేశ ప్రభుత్వాన్ని పాకిస్తాన్ సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. ప్రత్యేక వైద్య బోర్డుతో పరీక్షలు చేయించడంతో పాటు కుటుంబ సభ్యులను వారానికి ఒకసారి కలిసేందుకు అనుమతించాలని కూడా ఆదేశించింది. రావల్పిండిలోని అదియాలా జైలులో ఉన్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌ను ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ హాస్పిటల్‌కు తరలించి సమగ్ర వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్స అందించాలని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం ఆయనను 48 గంటల్లోగా ఆస్పత్రికి తరలించాల్సి ఉంది. ఇమ్రాన్ ఖాన్‌కు కొంతకాలంగా కంటి సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా కుడి కంటికి సంబంధించిన సెంట్రల్ రెటీనల్ వీన్ అక్లూషన్ సమస్య కారణంగా ఆయన చూపు గణనీయంగా దెబ్బతిన్నట్లు ఆయన కుటుంబ సభ్యులు, వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. జైలు అధికారులు మాత్రం ఇటీవల ఆయన చూపు దాదాపు సాధారణ స్థితికి వచ్చింది అని కోర్టుకు నివేదిక ఇచ్చారు. అదే సమయంలో వైద్య రికార్డుల్లో బీపీ మార్పులు, గుండెదడ, తలనొప్పి, ఆందోళన, అసహనం వంటి సమస్యలు కూడా నమోదైనట్లు సమాచారం.

ప్రత్యేక మెడికల్ బోర్డు
ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించేందుకు వైద్య నిపుణులతో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందులో ఆయన వ్యక్తిగత వైద్యుడు కూడా ఉండేలా కోర్టు సూచించింది. ఆయన కుమారులు ఖాసిమ్, సులేమాన్ చాలా కాలంగా తండ్రిని కలవలేకపోతున్నారని కుటుంబం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆయనను కలిసేందుకు అవకాశం కల్పించాలని ఇచ్చిన ఈ ఆదేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం

# రిజర్వేషన్లు

మొదటి తరువాయి

ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదికపై సమావేశంలో లోతుగా చర్చ జరిగింది. కమిషన్ సిఫార్సులతో 34 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరడం కష్టమని భావించిన మంత్రివర్గం, ప్రత్యామ్నాయ మార్గాలపై సమీక్షించి తుది నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ కానున్నాయి. మరో కీలక నిర్ణయంగా, పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అధిపతులను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానానికి కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా తీసుకున్న ఈ నిర్ణయానికి తాజా సమావేశంలో చట్టబద్ధత కల్పించారు. ఈ రెండు ప్రధాన అంశాలతో పాటు, దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి, పలు పాలనాపరమైన, అభివృద్ధి సంబంధిత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు సమాచారం. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ. 16,500 కోట్ల నిధులు మల్లిపోకుండా అక్టోబర్ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మున్సిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిద్దామని స్పష్టం చేశారు. మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఉన్న డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జిల్లాలను జిల్లాల పునర్వ్యవస్థాపనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్తులుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# మండలిలో మాటకు.. మాట

మొదటి తరువాయి



విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి, మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ అంటూ నినాదాలు హోరెత్తించారు. వైసీపీ సభ్యుల ఆందోళనల మధ్య ప్రశ్నోత్తరాలకు ఛైర్మన్ అనుమతించారు. మంత్రులు లోకేష్, గొట్టిపాటి రవికుమార్, పయ్యావుల కేశవ్ తమ శాఖలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఒకవైపు వైసీపీ సభ్యుల ఆందోళనలు మరోవైపు ప్రశ్నోత్తరాల్లో మంత్రుల సమాధానాలతో సభ గందరగోళంగా మారింది. ఈ దశలో పలువురు వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియం పైకి వెళ్లి ప్లకార్డులతో నిరసనలు హోరెత్తించారు. దీంతో సభ గందరగోళంగా మారింది..

అల్లరి చేసి వెళ్లిపోవడమే వైసీపీ సభ్యుల నైజం
ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ డీఎస్సీ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తోందని ప్రశ్నించారు. వేరే ఫార్మాట్లో ప్రతిపాదన తీసుకురావాలని ఛైర్మన్ సూచించినప్పటికీ విపక్షం వినకపోవడంతో మంత్రి పయ్యావుల కేశవ్ ఘాటుగా స్పందించారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా సభలో అల్లరి చేసి వెళ్లిపోవడమే వైసీపీ సభ్యుల ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ఛైర్మన్ ఛైర్ను అగౌరవపరిచేలా వైసీపీ సభ్యుల ఆందోళనలు ఉన్నాయన్నారు. డీఎస్సీపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ప్రతిపక్షం డిక్టేట్ చేయాలనుకుంటే కుదరదని మంత్రి కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో సమస్యతో వర్షాలు లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజా సమస్యలపై చర్చించకుండా వైసీపీ సభ్యులు సభలో అల్లరి చేయడం సరికాదన్నారు.

అసెంబ్లీలో ఎందుకు చర్చించారు?
ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ మంత్రి వాదన విడ్డూరంగా ఉందన్నారు. డీఎస్సీపై అసెంబ్లీలో చర్చించినప్పుడు అక్కడ ప్రజా సమస్యలు లేవా.. అప్పుడు లేని సమస్య శాసన మండలిలోనే వస్తుందా అని నిలదీశారు. అసెంబ్లీలో మాట్లాడిన విషయాలే మండలిలో చెప్పడానికి అభ్యంతరం ఏమిటని బొత్స ప్రశ్నించారు. ప్రశ్నోత్తరాలను వాయిదా వేసి డీఎస్సీ, స్పోర్ట్స్ కోటాపై చర్చించడానికి సమయం ఇవ్వాల్సిందేనని బొత్స పట్టుబట్టారు. సభ సజావుగా సాగని పరిస్థితుల్లో ఉదయం 10.32 గంటలకు ఛైర్మన్ సభను వాయిదా వేశారు. తిరిగి 1.20కు సభ ప్రారంభం కాగా రెండు నిమిషాల్లోనే బుధవారానికి మండలిని వాయిదా వేస్తూ ఛైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు.

# ఏపీని చూసి ఢిల్లీ నేర్చుకోవాలి


మొదటి తరువాయి

సింగ్ సిర్సా నేతృత్వంలో ఆ ప్రభుత్వానికి చెందిన ప్రత్యేక ప్రతినిధుల బృందం ఏపీలో పర్యటించి ఇక్కడ పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తోంది. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లో రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో ఈ బృందం మంగళవారం సమావేశమైంది. ఈ బృందానికి రాష్ట్ర ఐటీ, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సాదర స్వాగతం పలికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం గురించి వివరించారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని మంత్రి నారా లోకేష్ వివరించారు. 2026 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించిందన్నారు. భారతదేశం ఆకర్షిస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వస్తున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా క్లస్టర్ ఆధారిత అభివృద్ధి దిశగా పారిశ్రామికాభివృద్ధి సాధిస్తున్నామన్నారు. తిరుపతి ప్రాంతంలో ఎలక్ట్రానిక్ క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా ఆ రంగానికి చెందిన పరిశ్రమలు, అనుబంధ రంగ పరిశ్రమలన్నీ ఒకే చోట నెలకొల్పడానికి కావలసిన అనువైన వాతావరణం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో మొత్తం 22 క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమరావతి, తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాలను ఎకనామిక్ జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశాఖపట్నం ఉత్తరాంధ్ర ప్రగతికి కీలక కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. రాయలసీమలోని కర్నూలు జిల్లాలో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డేటా లేక్ ద్వారా పాలనను మరింత సరళీకృతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలకు చెందిన డేటాను ఒక చోట అనుసంధానించి డేటా లేక్ రూపొందించామని, దాని ద్వారా స్మార్ట్ గవర్నెన్స్ ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. డేటా కేవలం ఒక సోర్స్ నుంచి కాకుండా పలు సోర్సుల ద్వారా సేకరించి ఎప్పటికప్పుడు విశ్లేషించి డేటాను నిరంతరం అప్‌డేట్ చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పరిశీలన కూడా తాము ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని పాజిటివ్ పబ్లిక్ పెర్‌స్పెక్టివ్ పరిశీలిస్తూ పనిచేస్తున్నామన్నారు. మంత్రుల మొదలు, ప్రభుత్వంలో కింది స్థాయి ఉద్యోగి వరకు వారి పనితీరుకు ర్యాంకులు ఇస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో సభలు నిర్వహించినప్పుడు అక్కడ ఆ సభల్లోనే ప్రజల సమక్షంలో మంచిగా పనిచేసిన ఉద్యోగులను అభినందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడానికి ఏపీ అన్నివిధాల అనుకూలమైన రాష్ట్రంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చేవారికి ఎలాంటి అవరోధాలు లేకుండా అనుమతులన్నీ సులభంగా వచ్చేలా సింగిల్ విండో పోర్టల్ అమలు చేస్తున్నామన్నారు. డేటా సెంటర్లు, షిప్ బిల్డింగ్, సెమీకండక్టర్స్, మెడికల్ డివైజులు, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్లల మొదలు రాష్ట్రంలో 22 ప్రత్యేక క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా నూతన పారిశ్రామికాభివృద్ధి విధానం 4.0 ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

ఏపీ నుంచి మేం ఎంతో నేర్చుకోవాలి.. ఏపీ సహకారం కావాలి
పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి విధానాల అమలు తదితర అనేక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌ను చూసి మేము చాలా నేర్చుకోవాల్సి ఉందని ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ సిర్సా అన్నారు. తాను చాలా ప్రభుత్వాలను చూస్తున్నానని కానీ డేటాను ఇంత సమర్ధవంతంగా వినియోగించుకుని సత్ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ కు ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శిగా నిలిచిందన్నారు. అమరావతిలో ఇంత పెద్ద నిర్మాణ పనులు జరుగుతుండటం చూసి ఆశ్చర్యపోతున్నామన్నారు. ఢిల్లీలో ఇంత పెద్ద నిర్మాణాలు జరగడానికి ఆస్కారం లేదన్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచంలోనే ఒక గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతుందనడంలో ఎంత మాత్రం అనుమానం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విశ్వవిద్యాలయం లాంటి వారని, ఆయన పుత్రుడు మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు. మీ విశ్వ విద్యాలయంలో ఇప్పుడు మాకు కూడా అడ్మిషన్ ఇవ్వండి అని మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ చమత్కరించారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విధానాల రూపకల్పన, డేటా డ్రివెన్ గవర్నెన్స్ అమలు, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికున్న అపార అనుభవంతో ఢిల్లీ ప్రభుత్వానికి ఏపీ సహకారం అందించాలని కోరారు. ఏపీ బృందాన్ని ఢిల్లీకి పంపాలని, అక్కడ తమ అధికారులకు ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలు, విధానాల గురించి వివరించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ ఢిల్లీ ప్రభుత్వానికి తమ పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత ఎన్నికల వ్యవస్థను ఆదర్శంగా తీసుకోండి..

- అమెరికాలో ఓటర్ ఫొటో ఐడీ తప్పనిసరి చేయాలని సూచన
- 'సేవ్ అమెరికా యాక్ట్'ను ఆమోదించాలని పిలుపు
- భారత ఎన్నికల ప్రక్రియపై ట్రంప్ ప్రశంసలు
- అమెరికా ఎన్నికల్లో పౌరులకే ఓటు హక్కు
- మెయిల్ ఓటింగ్‌పై ఆంక్షలు విధించే ప్రతిపాదన
- జనవరి 29న చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం



వాషింగ్టన్ డీసీ:
భారతీయ ఎన్నికల వ్యవస్థను అమెరికా ఆదర్శంగా తీసుకోవాలని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ఓ కామెంట్ చేశారు. భారత ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఎలా సాగుతుందో.. ఆ రీతిలో ఓటర్ ఫోటో ఐడీ కార్డులను మనం కూడా తీసుకురావాలని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల భారత ముఖ్య ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ .. అమెరికా ప్రభుత్వ పెద్దలతో భేటీ అయ్యారని, ఫోటో ఐడీ లేకుండానే ఎలా అమెరికాలో ఎన్నికలను నిర్వహిస్తున్నారని సీఈవో జ్ఞానేశ్ ప్రశ్నించారని ట్రంప్ పేర్కొన్నారు. ట్రుత్ సోషల్‌లో ట్రంప్ ఓ పోస్టు చేశారు. ఆ పోస్టులో ట్రంప్ .. భారతీయ ఎన్నికల ప్రక్రియను మెచ్చుకున్నారు. గత జాతీయ ఎన్నికల్లో సుమారు 64.6 కోట్ల మంది ఓటు వేశారాని, దాంట్లో ఒక్క శాతం కన్నా తక్కువ సంఖ్యలో ఓటర్లు మెయిల్ ద్వారా ఓటు వేశారని, ప్రతి సింగిల్ ఓటర్‌కు ప్రత్యేకంగా ఫోటో ఐడీ కార్డు ఉందని, అయితే అదే తరహాలో అమెరికాలోనూ ఓటరు ఫోటో ఐడీలు కావాలని, దీని కోసం రూపొందించిన అమెరికా సేవ్(సేఫ్‌గార్డ్ అమెరికన్ ఓటర్ ఎలిజిబలిటీ) యాక్ట్‌ను ఉభయసభల్లో పాస్ చేయాల్సిన అవసరం ఉందని ట్రంప్ తన పోస్టులో వెల్లడించారు.వైట్‌హౌజ్ దీనిపై స్పందించింది. కేవలం అమెరికా పౌరులు మాత్రమే.. అమెరికా ఎన్నికల ప్రక్రియలో ఓటు వేయాలన్న ఉద్దేశాన్ని వ్యక్తం చేసింది. కేవలం అమెరికా పౌరులు మాత్రమే అమెరికా ఎన్నికలను డిసైడ్ చేయాలని వైట్‌హౌజ్ తన ప్రకటనలో తెలిపింది. అమెరికా సేవ్ యాక్ట్ బిల్లను పాస్ చేయాలని కోరింది. ఫెడరల్ ఎన్నికల వ్యవస్థలో ఓటు వేయడానికి ముందు రిజిస్టర్ చేసుకోవాలని, దీని కోసమే ఈ చట్టాన్ని ప్రతిపాదిస్తున్నట్లు వైట్‌హౌజ్‌త తెలిపింది.

# దేశంలో 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు..

మొదటి తరువాయి

అంశంపై ఈ నివేదికను సుప్రీంకోర్టుకు అందజేశారు. జూలై, 2026 నాటికి ఉన్న కేసులకు సంబంధించిన వివరాలివి. ఈ నివేదిక ప్రకారం.. దేశంలోని 28 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వారిలో 89 కేసులతో సీఎం రేవంత్ రెడ్డి మొదటి స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి 29 కేసులతో రెండో స్థానంలో ఉన్నారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇద్దరూ చెరో 19 కేసులతో మూడో స్తానంలో ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా కేరళ సీఎం వీడీ సతీషన్ 18 కేసులు, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ 5 కేసులు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ చెరో 4 కేసులు, తమిళనాడు సీఎం విజయ్, బిహారీ సీఎం సామ్రాట్ చౌదరి చెరో 2 కేసులు కలిగి ఉండగా, సిక్కిం సీఎం పీఎస్ తమాంగ్, పంజాబ్ సీఎం భగవంత్ మన్, ఒడిశా సీఎం మోహన చరణ్ మాంఝీ, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ ఒక్కో కేసు కలిగి ఉన్నారు. దేశంలోని ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులున్నాయి. అత్యధికంగా యూపీలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై కలిపి 1,171 క్రిమినల్ కేసులున్నాయి.

తెలుగు దిన పత్రిక PRGI NO:APTEL/26/A5450 WWW.NETIDARSHINI.COM
www.epaper.netidarshini.com బుధవారం 19-08-2026

# శ్రీ రాఘవేంద్ర స్వామి జీవిత చరిత్ర పుస్తకాన్ని



**మంత్రాలయం ఆగస్టు 18,( నేటి దర్శిని )**
మఠం పిఠాధిపతులు శ్రీ సుభూదేంద్ర తీర్థుల ఆశీస్సులతో, విప్రబాంధవర సంఘం సమక్షంలో సామాజికవేత్త, మల్లెల గ్రూప్స్ అధినేత, డా. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు, మైసూర్ కు చెందిన విప్రబాంధవర సంఘం కార్యదర్శి గురు రాజారావు, రచయిత నాగచంద్ర స్వామిలు రాఘవేంద్ర స్వామి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు కుల, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా చేసేటువంటి సేవను గుర్తించి వీరి చేతులు మీదుగా గురు రాఘవేంద్ర స్వామి వారి పవిత్ర జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరింపజేయడం జరిగింది. మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ శ్రీ గురు రాఘవేంద్ర స్వామి వారి పవిత్ర జీవిత చరిత్రను పుస్తక రూపంలో అందించడం ఎంతో అభినందనీయమని అన్నారు. కార్యం. భక్తి,జ్ఞానం, ధర్మం, మానవత విలువలకు ప్రతీకగా నిలిచిన శ్రీ రాఘవేంద్ర స్వామి వారి జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం అన్నారు. రాఘవేంద్ర స్వామి బోధనలు సేవా భావం, ఆధ్యాత్మిక సందేశం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఈ జీవిత చరిత్ర పుస్తకం ద్వారా స్వామివారి మహోన్నత వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక జీవనం,భక్తుల పట్ల వారి కరుణ,మరింత విస్తృతంగా ప్రజలకు చేరాలని ఆకాంక్షించారు. శ్రీ రాఘవేంద్ర స్వామి జీవిత చరిత్రను భక్తి,పరిశోధన, నిబద్ధతతో పుస్తక రూపంలో అందించిన రచయిత నాగ చంద్ర స్వామికి అభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో ఆపేక్ష, అనసూయ, సతీష్, రంజిత్ రెడ్డి, విప్రబాందవర సంఘం సభ్యులు మొదలగు వారు పాల్గొన్నారు.

# డ్రోన్ సిటీకి కేంద్ర మంత్రి రాక..

**-రామ్మోహన్ నాయుడుకు ఘన స్వాగతం..**
**-సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి**



**కర్నూలు రూరల్ బ్యూరో, ఆగస్టు 18,( నేటి దర్శిని )**
ఓర్వకల్లు మండలంలోని కర్నూలు డ్రోన్ సిటీలో నిర్వహించనున్న ఏపీ డ్రోన్ పరిశ్రమ సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం కర్నూలుకు చేరుకున్నారు. కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేసిన కర్నూలు డ్రోన్ సిటీకి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన డ్రోన్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను పరిశీలించి, వివిధ సంస్థలు ప్రదర్శించిన డ్రోన్ సాంకేతికత, ఉత్పత్తులను తిలకించారు.

**డ్రోన్ పరిశ్రమ అభివృద్ధిపై చర్చ**

ఎగ్జిబిషన్ అనంతరం డ్రోన్ సిటీలో నిర్వహించిన ఏపీ డ్రోన్ పరిశ్రమ సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. రాష్ట్రంలో డ్రోన్ పరిశ్రమ అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, డ్రోన్ సాంకేతికత వినియోగంపై సమావేశంలో చర్చించారు.కేంద్ర మంత్రి వెంట జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, డ్రోన్ కార్పొరేషన్ ఎండీ గీతాంజలి శర్మ, ఏపీఐఐసీ ఈడీ యశ్వంత్ కుమార్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. కర్నూలు డ్రోన్ సిటీని డ్రోన్ ఆధారిత పరిశ్రమలు, సాంకేతిక అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర మంత్రి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

# పేద ఎస్సీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసిన దాట్ల పృథ్వీరాజ్



**ముమ్మిడివరం, ఆగస్టు 18, (నేటి దర్శిని)**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా పేద ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దాట్ల పృథ్వీరాజ్ ఇచ్చిన మాట మేరకు మంగళవారం విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు.దాట్ల పృథ్వీరాజ్ అన్న స్వర్గీయ దాట్ల సీతారామరాజు రెండవ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఐపోలవరం మండలంశమురమళ్ళ గ్రామంలో గల ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఐ. పోలవరం మండలానికి చెందిన సుమారు 13 మంది పేద ఎస్సీ విద్యార్థులకు మొత్తం రూ.40,000 ఆర్థిక సహాయాన్ని దాట్ల పృథ్వీరాజ్, కుటుంబ సభ్యులు మరియు స్నేహితుల చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయం అందించడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తెలిపారు.

# హైవేపై అటవీ సంపద అక్రమ రవాణా..

**-అటవీ అధికారుల పనితీరుపై విమర్శలు**
**-నందికొట్కూరులో పట్టపగలే వెదురు అక్రమ రవాణా..**
**-అధికారులపై స్థానికుల ఆగ్రహం**



**నందికొట్కూరు, ఆగస్టు 18,( నేటి దర్శిని )**
నంద్యాల జిల్లా నల్లమల అటవీ ప్రాంతం నుంచి విలువైన వెదురు బొంగులను అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నందికొట్కూరు పట్టణంలో నాగలూటి రోడ్డు వైపు పట్టపగలే, జాతీయ రహదారి మీదుగా ఈ అక్రమ రవాణా సాగుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. మంగళవారం నందికొట్కూరు సమీపంలో ఏపీ 21 టీయూ 7665 నంబర్ గల ఆటోలో భారీగా పచ్చి వెదురు బొంగులను తరలిస్తుండటాన్ని స్థానికులు గమనించారు. టార్పాలిన్ కవర్లు, పాత చీరలతో వెదురు బొంగులను కప్పి, తాళ్లతో బిగించి జాతీయ రహదారిపై నిర్భయంగా తరలిస్తుండటంపై వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు తాజాగా నరికిన పచ్చి వెదురు కావడంతో వీటిని నల్లమల అటవీ ప్రాంతం నుంచి తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజూ పదుల సంఖ్యలో ఆటోలు, చిన్న వాహనాల్లో అటవీ సంపద తరలిపోతున్నా అటవీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.బీట్ సెక్షన్ అధికారులు ఎక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నారని, చెక్‌పోస్టుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. పట్టపగలే జాతీయ రహదారిపై బహిరంగంగా అటవీ ఉత్పత్తులను తరలిస్తున్నా అధికారుల దృష్టికి రాకపోవడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమ రవాణాదారులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం అటవీ ఉత్పత్తుల రవాణాకు అటవీ శాఖ అనుమతి, రవాణా పాస్ తప్పనిసరిగా ఉండాలని చెబుతున్నారు. అయితే ఇలాంటి వాహనాలను తనిఖీ చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు ఆటోపై కేఎన్ఎల్ టీఆర్ 1872 అనే మరో నంబర్ ప్లేట్ కూడా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. నల్లమల అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అడవి మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నందికొట్కూరు మార్గంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వాహన నంబర్ల ఆధారంగా విచారణ జరిపి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఓర్వకల్లు డ్రోన్ సిటీకి రూ.5 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

**దేశంలోనే ప్రముఖ డ్రోన్ కేంద్రంగా ఓర్వకల్లు డ్రోన్ సిటీ: రామ్మోహన్ నాయుడు**



**కర్నూలు రూరల్ బ్యూరో, ఆగస్టు 18,( నేటి దర్శిని )**
ఓర్వకల్లు డ్రోన్ సిటీని దేశంలోనే ప్రముఖ డ్రోన్ తయారీ, పరిశోధన, పరీక్షలు, శిక్షణ, సాంకేతిక అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. డ్రోన్ పరిశ్రమ ద్వారా రానున్న కాలంలో రూ.5 వేల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, డ్రోన్ సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే 5 వేల మందికి ప్రత్యక్షంగా, 25 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. మంగళవారం ఓర్వకల్లు డ్రోన్ సిటీలో డ్రోన్ పరిశ్రమలకు చెందిన సుమారు 150 మంది ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. డ్రోన్ తయారీతో పాటు పరిశోధన, వినియోగం, పరీక్షలు, ధ్రువీకరణ, శిక్షణ, సేవలను ఒకే ప్రాంతంలో అందించే సమగ్ర వ్యవస్థగా ఓర్వకల్లు డ్రోన్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

**600 ఎకరాల్లో డ్రోన్ సిటీ**

డ్రోన్ సాంకేతికత భవిష్యత్ అవసరాలను ముందుగానే గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండేళ్ల క్రితమే అమరావతిలో డ్రోన్ సమ్మిట్ నిర్వహించి ఈ రంగంలోని అవకాశాలను గుర్తించారని రామ్మోహన్ నాయుడు తెలిపారు. డ్రోన్ల తయారీ, వినియోగం, పరిశోధన, సేవలు, శిక్షణ తదితర కార్యకలాపాలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో ఓర్వకల్లులో 600 ఎకరాలను డ్రోన్ సిటీ కోసం కేటాయించినట్లు చెప్పారు. మొదటి దశలో 12 ప్లాట్లలో ఎనిమిది ప్లాట్లను ఇప్పటికే డ్రోన్ కంపెనీలకు కేటాయించామని, సుమారు 55 ఎకరాల్లో వివిధ సంస్థలకు స్థలాలు కేటాయించి తయారీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కంపెనీల ద్వారా సుమారు రూ.130 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు.

**రెండేళ్లలో తయారీకి చర్యలు**

హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అనేక డ్రోన్ కంపెనీలు ఓర్వకల్లు డ్రోన్ సిటీపై ఆసక్తి చూపుతున్నాయని మంత్రి తెలిపారు. విస్తరణ కార్యకలాపాలను ఇక్కడ చేపట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. రానున్న రెండు నుంచి మూడు సంవత్సరాల్లో అన్ని ప్లాట్ల కేటాయింపులు పూర్తి చేసి డ్రోన్ తయారీ కార్యకలాపాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రోన్ల పరీక్షలు, ధ్రువీకరణకు అవసరమైన సదుపాయాలతో పాటు గగనతల పరీక్షలకు అవసరమైన అనుమతులను వేగంగా పొందేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని పరిశ్రమ ప్రతినిధులు సూచించినట్లు తెలిపారు.

# యూనివర్సిటీ అభివృద్ధికై ఉద్యమించాలి..

**-ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలి**
**-యూనివర్సిటీ నూతన కమిటీ ఎన్నిక**
**-పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్**




**కర్నూలు రూరల్ బ్యూరో,ఆగస్టు 18,( నేటి దర్శిని )**
: యూనివర్సిటీ అభివృద్ధికై ఉద్యమించాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ పిలుపునిచ్చారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కార్యవర్గ నిర్మాణ జనరల్ కౌన్సిల్ నిర్వహించడం జరిగింది. ఈ కౌన్సిల్ కు జిల్లా ఉపాధ్యక్షుడు రమణ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా విచ్చేసిన పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ మాట్లాడుతూ.. పీ డీ ఎస్ యూ 1974 లో ఉస్మానియా యూనివర్సిటీలో కామ్రేడ్ జార్జిరెడ్డి స్థాపించారని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికై, అవినీతి అక్రమలపై విద్యార్థులు ఉద్యమించాలని అన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యను నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం అమలు చేస్తూ, యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ విదేశీ యూనివర్సిటీల రాకను ఆహ్వానించడం దేశంలో ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడంలో భాగమేనని అన్నారు. ప్రయోగ కేంద్రాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు నేడు రాజకీయ కేంద్రాలుగా మారాయి అని అన్నారు. రాష్ట్రంలో యూనివర్సిటీల వీసీ, రిజిస్టర్ నియామకాలు రాజకీయ కనుసైగల్లో జరుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వెనకబడిన యూనివర్సిటీ ల అభివృద్ధికి ఒక్కొక్క యూనివర్సిటీకి 200 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పేపర్ లీకేజ్ సంస్థ అయినా ఎన్ టి ఏ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ పాల్గొని మాట్లాడడం జరిగింది.

# అచ్చన్న నోరు అదుపులో పెట్టుకో

**- బొత్సపై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పు**
**- శాసనమండలి డైవర్షన్ కోసమే బొత్స టార్గెట్**
**- వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్**



**కాకినాడ, ఆగస్టు 18, ( నేటి దర్శిని ):**
అచ్చంనాయుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సీనియర్ నాయకుడిగా, రాష్ట్ర మంత్రిగా హుందాతనం ప్రదర్శించాలి కానీ ఇలా దిగజారి మరొక సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణపై నోరు పారేసుకోవడం సిగ్గుచేటని తక్షణమే క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని వై.యస్.ఆర్.సి.పి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్ డిమాండ్ చేశారు. కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొత్స సత్యనారాయణ విద్యాశాఖ మంత్రిగా ఉండగా ఈ రాష్ట్రంలో నాడు-నేడు ద్వారా స్కూళ్లు బాగుపడ్డాయి, ప్రభుత్వ స్కూళ్లకు సిబియస్ఇ సిలబస్ తీసుకొచ్చారు, మీడియంతో సంబంధం లేకుండా పిల్లలకు సబ్జెక్ట్ అర్థం అయ్యేలా బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు తీసుకొచ్చారు, ఇప్పుడు మీరు గొప్పలు చెప్పుకుంటున్న డీఎస్సీలో కూడా ఆయన మంత్రిగా ఉండగా నోటిఫికేషన్ ఇచ్చిన పది వేల పోస్టులు ఉన్నాయి మీరు దానికి కేవలం ఆరు వేలు పోస్టులు కలిపేసి మెగా డీఎస్సీ అని డప్పు కొట్టుకుంటున్నారు అని సంతోష్ విమర్శించారు. ఇలా చెప్పుకుంటూ పోతే విద్యా వ్యవస్థపై ఆయన మార్క్ కనపడుతుంది. మరి అచ్చంనాయుడు ఇప్పుడు మంత్రిగా ఉన్న వ్యవసాయశాఖ పరిస్థితేంటి ఈ రెండేళ్లలో ఒక్కసారైనా రైతులకు విత్తనాలు, యూరియా, ఎరువులు సమయానికి అందించారా అంటూ ఆయన ప్రశ్నించారు. మామిడి, మిరప, పొగాకు, వరి, ఆక్వా ఏ ఒక్క పంటకైనా గిట్టుబాటు ధర ఇప్పించారా అంటూ సంతోష్ ప్రశ్నించారు. ఎరువులు దొరకక రోజుల తరబడి రైతులు క్యూ లైన్లో నిలబడే పరిస్థితి, సకాలంలో నీరు కూడా అందించే పరిస్థితి లేదు పంటలు ఎండిపోతూ, రైతు నాశనం అవుతున్న సంగతి చూస్తూనే ఉన్నాంగా. మరి దద్దమ్మ ఎవరు ప్రజలు కూడా గుర్తిస్తున్నారు అని తెలిపారు. శాసనమండలిలో ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే దమ్ము లేక, మండలిలో వైసీపీ సభ్యులు లేవనెత్తే సమస్యలపై సమాధానాలు చెప్పలేక, అక్కడ జరుగుతున్న చర్చల ద్వారా ప్రజలకి వాస్తవాలు తెలిసే ప్రమాదం ఉన్నందున భయంతో డైవర్షన్ కోసం బాబు స్క్రిప్ట్ ను అచ్చన్న అమలుపరుస్తారు అని సంతోష్అన్నారు. ఇకపై ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు మానుకుంటే మంచిదని, ప్రజలు అమాయకులు కాదని అన్ని గమనిస్తారు ఎవరు దద్దమ్మలో వారే తెలియజేస్తారు అన్నారు. మా పార్టీ పెద్దన్న బొత్స సత్యనారాయణపై మరొకసారి ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుం ది అని అచ్చంనాయుడును ఆయన హెచ్చరించారు.

# సీఎం విజయ్ తనయుడి 'సిగ్మా' రిలీజ్ డేట్ ఫిక్స్..

## గాంధీ జయంతిన రాబోతున్న సందీప్ కిషన్!




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా 2026 అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



## కుందనపు బొమ్మలా మెరిసిన రుక్మిణి వసంత్..

# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది.




ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



# మాజీ లవర్‌పై అనుపమ పరమేశ్వరన్ నిప్పులు

అనుపమ పరమేశ్వరన్ తన బ్రేకప్, గత రిలేషన్‌షిప్ గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రేమించేటప్పుడు అంతా బానే ఉన్నా, విడిపోయిన తర్వాత నరకమేనని ఆమె పేర్కొన్నారు. గతంలో తానొక టాక్సిక్ రిలేషన్‌షిప్‌లో ఉన్నానని, ఎమోషనల్‌గా చాలా బాధపడ్డానని తెలిపారు. కొన్ని నెలలకే పెళ్లి దాకా మాటలు వచ్చినా, ఆ తర్వాతే తన మాజీ ప్రియుడి నిజ స్వరూపం బయటపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అతను తన బట్టలు, సోషల్ మీడియా పోస్టుల విషయంలో ఆంక్షలు విధించడంతో స్వేచ్ఛను పూర్తిగా కోల్పోయానని అనుపమ వివరించారు. అపరిచితుడు సినిమాలో విక్రమ్ పాత్రలాగా అతను క్షణానికొక రకంగా ప్రవర్తించేవాడని ఆమె సంచలన కామెంట్స్ చేశారు. ఈ చేదు అనుభవం వ్యక్తిగత జీవితం పైనే కాకుండా తన కెరీర్‌పైనా తీవ్ర ప్రభావం చూపిందని, డ్రాగన్ ప్రమోషన్స్‌కు కూడా వెళ్లనివ్వకుండా అడ్డుకున్నాడని అనుపమ వెల్లడించారు. ఈ బంధం ఇలాగే కొనసాగితే మనశ్శాంతి దూరమవుతుందని గ్రహించి బ్రేకప్ చెప్పానని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి తాను మానసికంగా చాలా మథనపడ్డానని ఆమె చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తన ఫోకస్ అంతా కెరీర్‌పైనే ఉందని, జీవితంలో మళ్లీ సంతోషాన్ని నింపుకునే పనిలో ఉన్నానని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. అయితే, తన మాజీ ప్రియుడి పేరును ఆమె బయటపెట్టలేదు.

# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు




తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

# నాన్‌స్టాప్‌గా 'రాపో23'



హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే పుదుచ్చేరి శివార్లలో 24 గంటల పాటు నిర్విరామంగా ఈ సినిమా షూటింగ్‌ను జరిపారు. హీరోగా, దర్శకుడిగా ఈ సినిమా కోసం రామ్ ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారని యూనిట్ వర్గాలు తెలిపాయి. 'పుదుచ్చేరిలో వేసిన భారీ సెట్‌లో తొమ్మిది రోజుల పాటు షూటింగ్ జరిపాం. ఇటీవల వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేక్‌పడింది. త్వరలో మళ్లీ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాత:కృష్ణ పోతినేని.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450